# పల్లెగూడెం కాడ

రోజుటాలె సీతాయ్ ఎంకాయ్ పుల్లలేరుకోను, సేలన్నీ దాట్తా, దిబ్బలంటా ఎక్కుతా, కుంటలంటా దిగుతా, ఆడ్తా, పదాలు పాడ్తా, గొడ్డమంద కెనక మాటె కిట్టకాలవకట్టకు సేరుకుండారు.

"యీయాల అచ్చరగాయ లాడద్దంటే, సీతాయ్? బాగుంతదే?"

"ఆడ్దాం గానీ...ఎంకాయ్, నూతో ఒరాస్సెం సెప్పాలే?"

"ఏందే బుల్లే, సెప్పే, సెప్పే!"

"వోర్తో సెప్పనని పెమానం సెయ్?"

"సేశాగా, సెప్పే, సెప్పే!"

"ఏందోనే...మరే..."

"ఓసెమ్మ పానీలేయే, నీకే మా పుందిలే పాయే..."

"గబ్బు లేపవు గందా?"

"లేపనన్నాగా, సెప్పే?"

"...నా పెల్లంటే."

"పెల్లి-"

"ఆఁ, పెల్లంటే!"

"అమ్మో, ఎట్టా!"

"ఎట్టాగేందే!"

"ఎట్టాగేందీ? నూ పెల్లవుతావనుకో! నీ మొగుడోడు నిన్నొదకన్నా లేపేసుకుపోతాడే!"

"ఆఁ!"

"ఆఁ, ఎట్టా! నన్ను కూడా తీసుకుపోయే?"

"ఊఁ మా అయ్య తిట్టడూ?"

"ఎందుకు తిడ్తాడమ్మ?"

"......"

"సీతాయ్, సీతాయ్?"

"నీకు మతుకు పెళ్ళి కాదంటే?"

"ఏందీ...?"

"ఏం నంగనాసివే?"

"నే పెల్లాణ్ణుగా, నీకు మల్లెనుకుండావా?"

"మీ అయ్యే సావ దన్నడూ?"

"మా అయ్యే మంచోడుగా, మీ అయ్యేకుమల్లే..."

"ఆఁ ముద్దెత్తుకుంతాడు...మరి పెల్లాడ కేం సేత్తావే?"

"ఏం సేత్తే నీకేం? యిట్టనే వుంతా, అసలు పెల్లెందుకమ్మా? నీకేం పెల్లాడ్తావ్ ఏమన్నా సేత్తావ్, ఆడు కొత్తా లేపేసుకపోతే-"

"అసలయిందంటా? అయ్యో అవ్వా మడనపడ్తంటే, ఎనకమాలుండి యిన్నానే!"

"ఏందీ? ఎట్టెట్టా!"

"పెల్లి సేత్తె బాగుంతదనీ ఎటకారం సేత్తంది ముసల్ది..."

"పానం తీశావుగందే. మరుసనాడే అవుద్దన్నట్టు అడలగొట్టి సంపావూ?"

"నాకు మటుకు తెలుసెట్టా—"

"సాల్లే పెల్లికూతరా, యీపాలికి, నీమీన గొడ్డెక్కిచ్చేసేదాన్నే యీయాల కల్లా! యింకీత యీదేయాలా, పుల్లలేరేయాలా, బుల్లివి గంద, సాల్లే సప్పున్నా".

ఆటలే ఆడారా, సిన్ని సిరతలూ పాటలే పాడారా సోద్దెమంటానూ, యీతలే యీదారా యింత యింతగనూ, నాత్తెమంటా ఆడారా సిలిపి పిల్లోడా అంట!

సప్పుసప్పున పుల్లాగిల్లా కట్టేసుక, సిన్ని పైటలెగరాడ్తా సిందులేత్తా, గొడ్డెనకమాలె అడ్తా, పదాలు పాడ్తా, సందకాడయ్యే తలికి ఎప్పుటాలె ఒయ్యారమంటా పల్లిగూడెం సేరేసుకుండారు ఎంకాయ్ సీతాయ్...

"...అవ్వోయ్, అయ్యొచ్చాడంతే?"

"యాడికెల్లా దేందో, యీయాల్దాకా యీడే కూకుండాడు."

పుల్లా పుడకా పొయికాడ సక్కంగ కుప్పేసి, జుత్తు యిదలేసుకా, గాబుకాడ కుండలోని నీలతో ఒల్లంతా ఆడీడ సక్కగా కడిగేసుకా-

"అవ్వా, యియ్యాల బూలో కేందే?"

కూతురు ఎచ్చి పోయాక, తన కింకోరూ లేకపోటాన, సీతాయిని గారాబాన పెంచింది అది. పిడకా బొడకా అమ్మి, సీతాయి పెల్లిగ్గాను కాత్తో కూత్తో యెన కేసింది. ఈరాయికి మటుకూ అత్తంటే మా అభిమానం. పెద్దముండ యింత బువ్వొండి పెడ్తా యిల్లు కనిపెట్టుకుంటది, తను సాటుసాట్న ఏం సేసుకున్నా,

కూతురంటే పానాన, ఆసాముల పన్లకుపోలా, నాలుగు డబ్బులు తెత్తా, అంద రాలె కూడా పోయేవోడు యీరాయీ.

తనకేయాల ఏమొచ్చిపడుద్దో, సీతాయి పెల్లిసూసి సత్తానంటా మొండి కెత్తి కూకుంది ముసల్ది. పదమూడేల్ల సీతాయికి పెల్లేందందామా, పానీ, యిది మంచి, యిదిసెడ్డ, అని సెబదామా, ఆకూత్తే వోడెపాలన్నా పడుద్దేమో? చరే నంటా, మంచి పిల్లకాయ దొరుకుతాడేమోని, సూత్తుండాడు...

"కుండలో నీలుపోయే తల్లా, సీకటలయి పోతల్లా?"

"ఏందమ్మా పద్దాకా తిప్పి సంపుతారూ, బూలోకి ఏందమ్మా, అంటే–"

"తెలగడ్డలేసి రొయ్‌పప్పు...అయ్యో సంబరమా! మొదలు నీలు తేవంటే?"

"ఊఁ" అని మూతి తిప్పతా గబగబ కుండ సంక నేసుక ల్లగెత్తుద్ది సీతాయ్... "కుంట కాడికి నీలకొత్తావంతే ఎంకాయ్".

"వత్తున్నా వుండేయ్..."

"యీయాల సందమామ ఎంత బాగుండాడే..."

"సల్లసల్లగా రారా సక్కనయ్యా" (సీతాయ్ పాడుద్ది) "సందమామా, సందమామా నూ, దామంటె వత్తావ సందమామా?"

(ఎంకాయ్ అందుకుంటది) "ఆటలంట ఆడుకుంతె సూత్తానె నవ్వుతానే"

"సందమామా, సందమామా నూ అల్లిబిల్లి ఆడ్దాం వత్తావ సందమామా?"

"రామంటె ఈలవుద్దా, సెట్టుకింద ముసలవ్వ కొట్టుద్దీ, తిట్టుద్దీ"

సీతాయ్ పాట "సందమామా, సందమామా నూ రాకుంటె ఎన్నముద్ద పెట్టనోరి సందమామా?"

"ఎన్నముద్ద తినే యేల నీతోటె కూకుంటా, నీకాడ బూ తింటా"

"సందమామా, సందమామా నూ పద్దాకుంటె సాలు సందమామా"

"బద్రమమ్మ కాల్ జారుద్దీ! కుంటకీయాలే నీలుబెట్టారూ"

"నాటొచ్చాక మావ్వ నన్ను నాటుకు తీసి కెల్తాందిగా"

"అబ్బా నేమతుకు రానెట్టా మా అయ్ నడిగీ?"

"నూ రాందీ, పోను మనసు పోద్దంటే?"

"బలే కుశాలగుంటదే, ఏం? అల్లందర్నీ ఎనకమాలపెత్తి ఆ వజాన సేనంతా నాటెయ్యం? హుఁ హుఁ."

"ఆ లెక్క లేకుండా, ఆ మాత్తరం సేయ్ లేంగా?"

"సీతాయ్, సీతాయ్ ఇయాల మనిద్దరం ఓకాడ బూతిందామె"

"ఓకాదే పండేసుకునీ, ఎన్నెట్టో కతలు సెప్పుకుందాంగా!..."

* * *

"తెల్లగా తెల్లారిపోంది, ఇదేందమ్మా యింకా లెగవరూ! చీతాయ్ ఎంకాయ్ లెగవండి లెగవండి, ఇదేందమ్మా! రేత్తిరంతా సంపుకుతిన్నారూ? లెగే చీతాయ్! శాకిరి సేసుకోక్కర్లా?..."

"ఏందమ్మా...కూ సేపుండు..."

"ఓసి నీ యిల్లు నేలగట్టా, అయ్యోరి కెల్లాళ్ళే!"

"ఆ...అయ్యో రేత్తిరే యాలకూ రాలేదు గమ్మా!"

"సెబతా, లే, పనంతా ఆవజానుందీ!..."

"ఎంకాయ్, ఎంకా—ఈశావంతే! ఈయాల దబ్దబున పంచేసుక, సల్ది బూ తిని పుల్లేరుకోను కిట్టకాలవకు పోవొద్దా?"

"రేత్తిరి సెడ్డ-బాగుందే...పోతున్నా వుండే...కేకేత్తావుగా..."

"ఆయ్యేడికల్లాడమ్మా, కొత్తపయిటా కొత్త రెయికా తెత్తానీ?"

"నిసిరేత్తిరనంగా వొచ్చే, పెదపాలెంకాడ ఓ పిల్లోడున్నాడు, సూసొత్తాని, పెందరకాడే లెగిసిపోయే"—

"పాపం తెత్తాని ఆసెపెత్తీ?..."

"తేడంటే, పెల్లంటూ తేల్నీ! మురుగులూ, దుద్దులూ, కడాలూ, ఇయన్నీ సేయించనూ?"

"నా కొద్దు పో, ఆసల్నే పెల్లాణ్ణా!"

"మా సిట్టమ్మే, యేం పోకడ పోతాయే, పెల్లయిన మరసనాడు మమ్మల్నసలు సూత్తా!"

"ఊఁ...మరి ఎంకాయ్ నాతో కూడా రావద్దమ్మా?"

"ఛీ! తప్పు కాదంటే, అదిమటుకు కూకుంతదెత్తా! వాల్లయ్య దానికి మటుకు పెల్లి సెయ్డూ? మాసక్కా సాగుద్ది పెల్లంతూ కావాల గాని...సాల్లే వగలు, సల్ది బూ తిందువురా."

"ఊఁ......"

"కొక్కిరిద్దువులే. మొగుడయ్యొత్తే..."

* * *

"ఎంకాయ్, నే పోతుండా?..."

"ఒచ్చొచ్చె!..."

"సూశావమ్మా, గొడ్లపిల్లోళ్ళు పోతుండా రప్పుడే!"

"పానీలే ఎనకమాలె పదాలు పాడుకుంటా పోదాం."

పాట సీతాయ్ "స్త్రితమంటావు, సెలరేగి సిందేసె సిన్నికిష్టుడూ"

పాట ఎంకాయ్ "ఓయమ్మ యశోదమ్మ యినవమ్మ యింతింతలా"

పాట సీతాయ్ "ఎన్నముద్దాలన్ని యిరివిగా తింటుంటె, సెప్పవత్తా వుంటె సెంప పగలా గొట్టి సక్క బోయేనూ"

"ఇంతింత లేంది యిను యశోదమ్మ సెంప పగలాగొట్టె సిలిపి కుష్టుడూ!"

"పాలకంటా బోయి కోడ లొత్తావుంటె సెయి బట్టుక సరసమాడేనూ!"

"ఇనవమ్మ యశోదమ్మ ఎట్టా బతికెటట్టు సౌరవసేసుక సంపుతావుంటే!"

"ఎకిలి పనులాంట సెయిబట్టుకోబోతే పేడముద్దా తీసుక సిందకొట్టాడమ్మ"

"ఇనవమ్మ యినవమ్మ యశోదమ్మ సంపుతాడంట సెప్పకుండేదెట్ట?..."

"దొద్దొద్దొద్దా—గట్టక సేరాం!..."

"ఓలెమ్మ ఏం లగెత్తుందే, కాలవా."

"ఈతలేద్దాం?"

"బొమ్మరిల్లు కట్టద్దూ?"

"చెల్!..."

"నూ పెల్లికూతురువంట! నే పెల్లికొడుకునంట! ఇల్లు కడదామంట!"

"మరే...నే పెల్లాడబోతున్నాగా! మా ఆయ్యా...ఎల్లాడుగా?"

"పానీలేయే, నాసంగతోరిక్కా-వాలా?..."

"హి హి హి! ఒకమ్మాయి అలిగింది, పానీలేమ్మా, తమాసె కంటేనూ! వొప్పుడూ మనిద్దరం ఒకటిగా."

"సత్తెప్రెమానం సెయ్?"

"పెమానం!"

"మా సీతాయ్!"

"తానాలాడదాం?"

"ఓ—కెరటా ల్లెగుత్తున్నయ్యే, ఒడ్డుకాణ్ణే వుందాం"

"ఎవరు లేర్లే...దిగు దిగు..."

వూయ్-వూయ్-వూ —"

"ఓ ఓ ఓ..."

"అబ్బ తోసుద్దేం?"

ఎర్రగున్నై కొత్తనీలు...తవ్ తవ్—"

"కెరటా లెగుత్తున్నయ్యే—"

"అమ్మో పామే! పామే! నాయనో—ఆడే, ఆడే, యీడే!—"

"యాడే – ఆయ్యో – ఓమ్మో - సీతాయ్, సీతా - యాడికే – లోపలికి పోతుండావ్ !—"

"ఎంకాయ్–పోతుండా–"

"ఒత్తుండా–సీతాయ్–వుండే–"

*           *           *

కెరటాలెగిరెగిరి పడ్డయ్! తోసేసుకుపోనై బొమ్మరిల్లుతో కూడా.

"కాలవగట్టేందో కరిగిపోతేను, గొడ్డకా డోరంత గొల్లుమన్నారు–గూడెమంతాకూడ గబ్బుమన్నాది–"

*